# దేవుని ఎలా ఘనపరచవచ్చు

మనము తెలుసుకోవలసిన విషయమేమంటే దేవుడు మనలను సృష్టించుటకు కారణము ఆయనను ఘనపరచుట కొరకే. యెషయా 43:7లో “నా మహిమ నిమిత్తము నేను సృజించినవారు" అని దేవుడు అంటున్నాడు. సృష్టించిన ప్రతి ఒక్క ప్రాణమున్న జీవి, ప్రకృతి అంతా కూడా దేవుని స్తుతిస్తున్నట్లుగా చూస్తున్నాము. పరలోకంలో ఉన్న దేవదూతలు కూడా నిరంతరము దేవుని స్తుతిస్తున్నట్లుగా చూస్తున్నాము.

మత్తయి సువార్త 15:8లో యేసుప్రభువు శాస్త్రులు, పరిసయ్యులను గురించి మాట్లాడుచూ వారు తమ పెదవులతో తనను ఘనపరచుదురు గాని వారి హృదయము తనకు దూరముగా ఉన్నది అన్నాడు. మనము అలాగు ఉండరాదని మిమ్ములను కోరుచున్నాను. మనము మనస్పూర్తిగా దేవుని ఘనపరచినప్పుడే పైన పేర్కొన్న ఆశీర్వాదములు పొందుకొంటాము. అపొస్తలుడైన పౌలు దేవుని వాక్యము బోధించుట ద్వారా దేవుని మహిమ పరచేవాడు. ఏ పరిస్థితులోనైనా దేవునిఘనపరచలేకపోయినప్పుడు చాలా బాధ చెందేవాడు. నేను ఈ సమయంలో "దేవుని ఘనపరచుట ఎలా?" అనే అంశము మీద కొన్ని విధానాలు మీ ముందుంచుచున్నాను.

## 1. మొదటిగా ఇచ్చుట ద్వారా దేవుని ఘనపరచవచ్చును :

సామెతలు 3:9లో "నీ రాబడి అంతటిలో ప్రథమ ఫలమును, నీ ఆస్తిలో భాగమును ఇచ్చి యెహోవాను ఘనపరచుము" అనే ఆదేశము వ్రాయబడినది. 10 వచనములో తద్వారా వచ్చే ఘనత కూడా వ్రాయబడి ఉంది. "అప్పుడు నీ కొట్లలో ధాన్యము నీ సమృద్ధిగా నుండును, నీ గానుగలలో నుండి క్రొత్త ద్రాక్షారసము పైకి పొరలి పారును". దేవుని మహిమ పరచినప్పుడు మనము కూడా మహిమ పరచబడుతాము అనే విషయానికి ఇది ఒక ఉదాహరణ. దేవునికి ఇచ్చుటలో చాలా జాగ్రత్త వహించవలెను. ' రాబడిలో ప్రథమ ఫలము' అని వ్రాయబడి ఉంది. మనము ఈ విషయము గురించి ఆలోచించినప్పుడు ఆదాము కుమారులు కయీను, హేబెలును గుర్తు తెచ్చుకోవాలి. ఆదికాండము 4:2-4లో చూచినప్పుడు కయీను పొలము పంటలో కొంతభాగము అర్పణగా తెచ్చినట్లును, హేబెలు తన మందలో తొలిచూలుగా పుట్టిన వాటిని తెచ్చినట్లు చూస్తున్నాము. “యెహోవా హేబెలును అతని అర్పణను లక్ష్య పెట్టెను" అని వ్రాయబడి ఉన్నది. హేబెలు దేవునికి ఇష్టమైన అర్పణను ఇచ్చుట ద్వారా ఘనపరచినాడు.

## 2 బీదల మీద కనికరము చూపుట ద్వారా దేవుని మహిమ పరచవచ్చును

సామెతలు 14:31లో "బీదలను కనికరించువాడు ఆయనను ఘనపరచువాడు" అని వ్రాయబడినది. "విశ్వాసము క్రియలు లేనిదైతే అది ఒంటిరిగా ఉండి మృతమైనదగును" (యాకోబు 2:17) అని బైబలు వాక్య ప్రకారము మనకు భక్తి, విశ్వాసము, ప్రేమ వుంది అని మాటల్లో చెప్పడము కాకుండా చేతల్లో చేసి చూపించాలి.

మనకు అవకాశందొరికినప్పుడెల్లా బీదలకు, అనాథలకు, విధవరాండ్రకు సాయం చేస్తే దేవుని ఘనపరచిన వారమౌతాము.

## 3. ఆదివారము దినమును పరిశుద్ధముగా ఆచరించుట ద్వారా

యెషయా 58:13లో ఒక ఆదేశము, దానితోపాటు వచ్చే ఆశీర్వాదము ఘనత నే ప్రస్తావించబడ్డాయి. విశ్రాంతి దినమును దేవునికి ప్రతిష్టించి, దేవుని సన్నిధిలో దేవుని ఘనపరచిన యెడల ఉన్నత స్థలములోనికి మనలను ఎక్కించెదననియు, యాకోబు స్వాస్థ్యమును అనుగ్రహించి మనలను ఘనపరచెదననియు దేవుడు వాగ్దానము చేయుచున్నాడు. ఆదివారము మనము మందిరమునకు వెళ్లుటలో అశ్రద్ధ చేసిన యెడల మనకు రావలసిన ఘనతను పోగొట్టుకుంటామని తెలిసికొనుట మంచిది

.

## 4. పరిశుద్ధ జీవితాలు జీవించుట ద్వారా

"నేను పరిశుద్ధుడను గనుక మీరును పరిశుద్ధులు కావలెను" (లేవీ 11:45) అని యెహోవా దేవుడు సెలవిచ్చి యున్నాడు. కొండమీది ప్రసంగములో యేసుప్రభువు ఈ విధంగా చెప్తున్నాడు :

"హృదయశుద్ధి కలవారు ధన్యులు, వారు దేవుని చూచెదరు" (మత్తయి 5:8). పరిశుద్ధులుగా ఉండుటకు మన ప్రార్థనా జీవితం దోహదపడుతుంది. మనము పరిశుద్ధులుగా ఉంటూ మన జీవితాల ద్వారా దేవుని ఘనపరుస్తూ సాక్షులుగా జీవించాలి. మన శరీరము దేవుని ఆలయం కాబట్టి దానిని పరిశుద్ధంగా ఉంచుకొనుట మన కర్తవ్యం.

## 5. దేవుడు మన జీవితాల్లో చేస్తున్న, మేలులను గురించి సాక్ష్యము చెప్పుట ద్వారా

కీర్తనలు 103:2లో దావీదు, "నా ప్రాణమా యెహోవాను సన్నుతించుము. ఆయన చేసిన ఉపకారములలో దేనిని మరువకుము" అని వ్రాయబడి ఉన్నది. 'స్తుతియాగము అర్పించువాడు నన్ను (దేవునిని) మహిమపరచుచున్నాడు" అనే వాక్యములు కీర్తనలు 50 వ అధ్యాయములో 23 వ వచనములో చూడగలము. మన జీవితాల్లో అనుదినము ఎన్నో మేలులు వుడు చేస్తున్నాడు. అవన్నీ ఇతరులతో చెప్పుట ద్వారా దేవునికి ఘనత

.

## 6. దేవుని చిత్త ప్రకారము చేయుట వల్ల దేవుని ఘనపరచగలము :

ఏ పని చేసినా దేవుని చిత్త ప్రకారము చేయుట ద్వారా మనకు విజయము కలుగుతుంది. ఆ విజయాల వెనుక నున్న రహస్యము తెలిసికొని అన్యులు నిజమైన దేవుని దగ్గరకు వస్తే దాని ద్వారా దేవునికి మహిమ, ఘనతలు వస్తాయి.

యోహాను 7: 17 ఎవడైనను ఆయన చిత్తము చొప్పున చేయ నిశ్చయించుకొనినయెడల, ఆ బోధ దేవుని వలన కలిగినదో, లేక నా యంతట నేనే బోధించుచున్నానో,వాడు తెలిసికొనును.

## 7. సైతానుపై విజయము సాధించుట ద్వారా

ఎఫెసీ 6:10-17 లో చెప్పబడిన ప్రకారము "అపవాది తంత్రములను ఎదిరించుటకు శక్తిమంతులగునట్లు దేవుడిచ్చు సర్వాంగ కవచమును ధరించుకొనుడి". సైతానుపై మనము విజయము పొందినప్పుడు దేవునికి మహిమ.

## 8. దేవుని సేవించుట ద్వారా ఆయనను ఘనపరచవచ్చును

యోహాను 12:26లో యేసుప్రభువు ఈ విధంగా సెలవిచ్చాడు: "ఒకడు నన్ను సేవించిన యెడల నా తండ్రి అతని ఘనపరచును". మనకు దేవుడిచ్చిన తలాంతులను దేవుని సేవకై ఉపయోగించి తద్వారా

ఆయనను ఘనపరచలెను.